# భారత్... పేదరిక నిర్మూలన

**దశాబ్దాల పాటు విదేశీ పాలన.. జనాభా అనూహ్యంగా పెరిగిపోవడం.. దేశంలో పేదరికానికి ప్రధాన కారణం.స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. పేదరిక నిర్మూలనపై దృష్టిసారించాయి. పలు పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి పథకాలు చేపట్టాయి. సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు పేదరిక నిర్మూలన అంశాన్ని అధ్యయనం చేయడం ఉపయుక్తం!!**

పేదరికం, నిరుద్యోగిత.. దేశాభివృద్ధికి పెద్ద సమస్యగా పరిణమించాయి. ఈ పదాలకు నిర్వచనాలు కూడా తరచూ మారుతున్నాయి. కనీస జీవన ప్రమాణాలు లోపించడం, పౌష్టికాహార లోపం, నిరక్షరాస్యత, మానవాభివృద్ధిలో వెనుకబాటుతనం మొదలైనవి పేదరికం లక్షణాలుగా చెప్పవచ్చు. పేదరికాన్ని నిర్మూలించే ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచే ప్రారంభించాయి.. భారత్‌లో పేదరికాన్ని రెండు రకాలుగా నిర్వచిస్తారు... 1) నిర్దిష్ట పేదరికం, 2) సాపేక్ష పేదరికం

### నిర్దిష్ట పేదరికం :

కనీస జీవన ప్రమాణాల్లోని వివిధ అంశాలను నిర్దిష్ట పరిమాణంలో పరిగణనలోకి తీసుకొని, ఆ పరిమాణానికి దిగువన ఉన్న వ్యక్తులందరినీ దారిద్య్రరేఖకు దిగువన ఉన్నవారిగా గుర్తిస్తారు.

### సాపేక్ష పేదరికం :

ఇది వివిధ వ్యక్తులు లేదా సమూహాలకు అందుబాటులో ఉన్న వనరులు, వేతనం, సంపద తదితరాల్లో... అసమానతల ఆధారంగా సాపేక్ష పేదరికాన్ని లెక్కిస్తారు. భారత్‌లో పేదరికం సాధారణంగా నిర్దిష్ట పేదరికం.

### పేదరిక లెక్కింపు:

నిర్దిష్ట పేదరికాన్ని లెక్కించేందుకు 'దారిద్య్రరేఖ' అనే భావనను దాదాభాయి నౌరోజీ మొదటిసారిగా.." Poverty and unBritish Rule in India" అనే గ్రంథంలో జైల్లో ఖైదీల కనీస పౌష్టికాహారం ఆధారంగా నిర్వచించారు. 1940, 1950లలో కలకత్తాలోని Indian Statistical Institute మహలనోబిస్.. శాంపుల్ సర్వే ద్వారా పేదరికాన్ని లెక్కించే ప్రయత్నం చేశారు. ఈ పద్ధతిని NSSO (National Sample Survey Organisation)లో ప్రవేశపెట్టారు.

### ఓర్ఝూ కమిటీ నివేదిక :

ఈ కమిటీ ఆహారంలో దినసరి పౌష్టిక విలువల ఆధారంగా దారిద్య్రరేఖను నిర్వచించింది. రోజుకు ప్రతి వ్యక్తికి 2250 కేలరీలను ప్రామాణికంగా తీసుకుంది. ఈ విలువను రూపాయి మారకంలోకి

మార్చినందుకు 1960-61 ధరల ప్రకారం.. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.15 నుంచి రూ.18, గ్రామీణ ప్రాంతాల్లో రూ.8 నుంచి రూ.11 నెలసరి వేతనంకంటే తక్కువ ఉంటే దాన్ని దారిద్ర్యరేఖగా నిర్వచించారు. ఆ ప్రకారం 1967-68లలో గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.

### దండేకర్-రథ్ అధ్యయన బృందం:

దండేకర్-రథ్ బృందాన్ని ప్రణాళిక సంఘం నియమించింది. ఓఝూ కమిటీ సూచించిన 2250 కేలరీల దినసరి పౌష్టిక విలువతో ఈ బృందం ఏకీభవించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు.. వారు నిర్వహించే విధులను అనుసరించి వేర్వేరు పౌష్టిక విలువల ఆధారంగా దారిద్ర్యరేఖను నిర్వచించాలని సూచించింది. 1968-69 ధరల ప్రకారం- గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ.324, పట్టణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.486కంటే తక్కువ ఆదాయాన్ని దారిద్ర్యరేఖగా పేర్కొంది. దీన్ని అనుసరించి గ్రామీణ ప్రాంతాల్లో 40% ప్రజలు, పట్టణ ప్రాంతాల్లో 50% కంటే అధిక జనాభా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.

### మాంటెక్ సింగ్ అహ్లువాలియా అధ్యయనం:

1956-57 నుంచి 1973-74 మధ్యకాలంలో పేదరిక పరిమాణంలో వచ్చిన మార్పులను మాంటెక్‌సింగ్ అహ్లువాలియా అధ్యయనం చేశారు. 1960-61 ధరల ప్రకారం- గ్రామప్రాంతాల్లో రూ.15ను, పట్టణప్రాంతాల్లో రూ.20 నెలసరి వ్యయాన్ని దారిద్ర్యరేఖగా పరిగణించారు. స్థూల జాతీయోత్పత్తిని పెంచడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చని ఆయన ప్రతిపాదించారు.

### ఏడో ఆర్థిక సంఘం నివేదిక:

ఈ సంఘం పేదరికాన్ని లెక్కించేందుకు ''విస్తృత దారిద్ర్యరేఖ'' అనే భావనను ప్రతిపాదించింది. (Augmented Poverty line). దీనిలో సూచించిన వివిధ అంశాలు... సురక్షిత నీటి సరఫరా, కనీస విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, పౌష్టికాహారం, రోడ్డు వసతి. ఆయా అవసరాల కోసం ప్రతీవ్యక్తి పెట్టే కనీస నెలసరి వ్యయం ఆధారంగా దారిద్ర్యరేఖను నిర్వచించాలి. 1970-71ధరల ఆధారంగా... 52% జనాభా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లుగా ఈ సంఘం లెక్కించింది.

### మిన్హాస్ అధ్యయన బృందం :

మిన్హాస్, జైన్, టెండూల్కర్ సభ్యులుగా ఉన్న ఈ బృందం కొనుగోలు సామర్థ్యం ఆధారంగా దారిద్ర్యరేఖను నిర్వచించింది.

### లక్డవాలా కమిటీ:

లక్డవాల కమిటీని 1989లో ప్రణాళికా సంఘం నియమించింది. ఈ కమిటీ తన నివేదికను 1993లో

సమర్పించింది. సమాజంలో వివిధ వర్గాల కొనుగోలు సామర్థ్యాన్ని గుర్తించేందుకు ప్రమాణాలైన CPIAL (Consumer Price Index for Agricultural labourers), CPI IW (Consumer Price Index for Industrial Workers), CPI NM (Consumer Price Index for NonManual Employees)ను ఉపయోగించి, దారిద్ర్యరేఖను నిర్వచించింది. కొనుగోలు సామర్ధ్యం ఆధారంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.49, పట్టణ ప్రాంతాల్లో రూ.57 నెలసరి వ్యయాన్ని దారిద్ర్యరేఖగా సూచించింది. ఈ గణాంకాల ప్రకారం- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజల శాతం 1983లో 45%కు 1988లో 39.3%కి తగ్గినట్లుగా కనిపిస్తోంది. గతంలో వినియోగించిన గణాంకాలకు, లకడావాలా కమిటీ గణాంకాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది.

### 6వ పంచవర్ష ప్రణాళిక:

పౌష్టిక విలువలను ప్రామాణికంగా తీసుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేర్వేరు దారిద్ర్యరేఖలను సూచించింది. గ్రామ ప్రాంతాల్లో రోజుకు 2400 కేలరీలను, పట్టణ ప్రాంతాల్లో 2100 కంటే తక్కువ కేలరీలను దారిద్ర్యరేఖగా ప్రతిపాదించింది.

### 2007 ముఖ్యమంత్రుల సదస్సు:

దారిద్ర్యరేఖను నిర్వచించేందుకు ఏడు కనీస ప్రాథమిక సేవలను ముఖ్యమంత్రుల సదస్సు ప్రామాణికంగా సూచించింది. అవి..

1) పౌష్టికాహారం, 2) విద్య

3) ఆరోగ్యం 4) సురక్షిత మంచినీరు

5) కనీస గృహవసతి6) డ్రైనేజీ సౌకర్యాలు

7) రోడ్డు రవాణా సౌకర్యాలు

ప్రస్తుతం భారతదేశంలో పౌష్టిక విలువల ఆధారంగా పేదరికాన్ని లెక్కిస్తున్నారు. ఎక్కువ శాతం మంది నిరక్షరాస్యులు గల భారత్ వంటి దేశాల్లో దినసరి పౌష్టిక విలువలను లెక్కించడం కష్టం. అందువల్ల పౌష్టిక విలువల పరిమాణాన్ని రూపాయి విలువలోకి మార్చి దారిద్ర్యరేఖను లెక్కించాల్సి ఉంటుంది. రూపాయి విలువ, ద్రవ్యోల్బణం వల్ల నిరంతర మారుతూ ఉండటంతో దారిద్ర్యరేఖను ఏడాదికి ఒకసారైనా నిర్వచించాల్సి ఉంటుంది.. స్వాతంత్ర్య అనంతరం అనేక పేదరిక నిర్మూలనా పథకాలను అమలుచేసినప్పటికీ పేదరిక నిర్మూలనను సాధించలేకపోవడానికి కారణం పేదరికాన్ని సరైన రీతిలో నిర్వచించలేకపోవడమే!!